౩౪

# పల్లెటూరి సంబంధం

"ఏమిటి, నాన్నా? నా కక్కర్లేదు, నాన్నా! నేనసలు పెళ్ళే చేసుకోనట్లా అయితే!" అంటూ సీత చిందులు తొక్కింది.

చిన్నప్పట్నుంచి పట్నంలో పెరిగింది. పట్నవాసం మరిగింది. స్కూలు ఫైనలుదాకా చదువుకున్నది. సినిమాలూ, నాటకాలూ, పాటకచేరీలూ, బీచి షికార్లూ, పిక్నిక్కులూ, నవలలూ, కథలూ, పత్రికలూ, రేడియోవగైరాలతో జీవితం ఉల్లాసంగా గడిచిపోయింది. భగవంతుడిచ్చిన అందచందాలకే నలుగురు మురుస్తుంటే దానితో సంతృప్తిపడక శరీరసౌందర్యాన్ని పలువిధాల పోషించుకుంటూ ఎంతో ప్రావీణ్యతతో అలంకరించుకుంటూ ఉండేది. వెనకటి సత్యభామకు ఏడు వారాల సొమ్ములే ఉండేవి, కాని సీతమ్మ తల్లికి పాతిక రకాల గాజులూ, పాతిక రకాల చీరలూ వగైరా ఉన్నై.

సీతమ్మ తల్లికి రహస్యాలోచనలు చాలా ఉన్నై. తనకు పెళ్ళయితే భార్యా భర్తలిద్దరూ ఒక్కక్షణం ఒకళ్ళనొకళ్ళు విడవకుండా అస్తమానమూ తిరగాలి, కలిసి భోంచెయ్యాలి. కలిసి షికారువెళ్ళాలి కలిసి సినిమాకెళ్ళాలి. ఇద్దరికీ ఏ కారణంచేతా క్షణం ఎడబాటు రాకూడదు. ఒకరి కొకరు చీమ తలకాయంత తప్పు చేసుకోకూడదు. ఇద్దరి మధ్యా చీమ తలకాయంత పొరపు రాకూడదు. భర్తలో ఉండే సౌందర్యలోపాన్ని యావత్తూ తానే తీర్చాలి. తమ నిద్దర్నీ చూసి అందరు దంపతులూ ఆశ్చర్య పడాలి... బిడ్డల్ని కనరాదు. ఎప్పుడో—చాలా ఏళ్ళకు—అప్పుడు చూసుకోవచ్చు... వొళ్ళు చెడిపోతుంది. అన్నిటికీ సాధనాలున్నై, చక్కగా!...

ఈ నాగరకయుగంలో పుట్టినందుకు సీత చాలా సంతోషించేది. ఎన్ని అలంకరణ సాధనాలు! ఎన్ని రకాల ఫాషనులు! ఎన్ని సదుపాయాలు! డబ్బే ఉండాలి గాని— అదృష్టవశాత్తూ డబ్బుకేమీ కొదవ లేదు: దేవుడిచ్చింది—అంటే, సీత తండ్రి ప్లీడర్ చేసి కష్టించి ఆర్జించినది—బోలెడుంది!... ఎవరయినా ముసలాళ్ళు, "ఎన్ని రకాల నగలే! ఎన్ని రకాల చీరలే—తుమ్మెద రెక్కలల్లే! మా కాలంలో ఇవేమీ ఎరగం కద!", అని అన్నప్పుడల్లా, భగవంతుడు తనను 1928 లో పుట్టించినందుకు సీతమ్మతల్లి ఎంతో అబ్బురపడేది.

కాని ఏం లాభం? పాపం, సంవత్సరం నుంచీ సీతమ్మ కొచ్చే సంబంధాలు నిరుత్సాహజనకంగా ఉంటూ వచ్చినై. డబ్బున్న కుర్రాళ్ళు బాగా లేరు; బాగా ఉన్న కుర్రాళ్ళకు చదువు లేదు; అన్నిటిలోనూ ఘట్టిగా పాపయిన కుర్రాళ్ళకి డబ్బు లేదు. ఒక కుర్రాడొచ్చి గంటసేపు తన ముందు సినిమాస్టారు పోజులన్నీ పెట్టి ఇంగ్లీషు తప్ప తెలుగే మాట్లాడ లేదు. మరొ క్కడు ఎంతో వినయ విధేయతలతో వచ్చి, "టాల్‌స్టాయి పుస్తకాలు చదివావా? గాంధీ ఆత్మ కథ చదివావా? జాన్ స్టూవర్ట్ మిల్ గ్రంథాలు చదివావా?" అని అడిగాడు. మరో కుర్రాడు—చూడటానికి బాగున్నాడు కూడానూ, ఖర్మ!—ఆడవాళ్ళకు చదువుండరాదనీ, స్వేచ్ఛ ఉండరాదనీ, వాళ్ళ కిప్పుడున్న సంస్కారం పదింతలైనా పెరిగితే తప్ప అటువంటి విషయాలు గురించి ఆలోచించటంలో అర్థంలేదనీ, ఏమేమిటో చెలిపోయినాడు.

ఈ రకాలను ఒక్కొక్కరినే చూస్తున్న కొద్దీ సీతకు గుండె జారిపో సాగింది. తన కలలన్నీ కల్లలై పోవలిసిందేనా? ఈ ప్రపంచంలో తన మాదిరి అభిప్రాయాలున్న మగపురుగే లేడా అనిపించింది. చూడగా చూడగా లేనట్లే కనిపించింది.

ఇప్పుడు కొత్తగా సీత తండ్రి మరో సంబంధం తీసుకొచ్చాడు. సీత అభిప్రాయం తీసుకోకుండానే—సీత కొక అభిప్రాయం ఉండొచ్చునన్నైనా భావించకుండానే—నలుగురూ సంబంధం బాగుందంటే బాగుందనుకున్నారు. ఇంటి కొచ్చిన ప్రతివాడూ దివ్యమైన సంబంధం అనటమే? ఏమిటిటా? వాళ్ళకి నూరెకరాల పొలం ఉందిట, కుర్రాడు బాగుంటాడుట ఒకడే కొడుకుట. రైలుస్టేషనుకు ఆమడ దూరంలో ఉన్న ఆ దిక్కుమాలిన పల్లెటూళ్లో వాళ్ళకో మేడ ఉందిట, ఒక డొక్కుకారుకూడా ఉందిట, పిల్లవాడు ఇంటరు చదువుతూ, ఆరోగ్యం చెడి చదువు చాలించాడుట; ఇక చదవడట! కుర్రవాడు తల్లిదండ్రుల్ని విడిచి బస్తీలో గాని, పట్నంలోగాని కాపరం పెట్టడుట. పిల్లవాణ్ణి సీత చూసింది. బాగానే ఉన్నాడు, ఏం లాభం? అతను వేసుకున్న గుడ్డలూ, ఆ పల్లెటూరి చాకలి చేసిన చలువా చూస్తే సీతమ్మ గుండె జారిపోయింది. (సీత గుండె చాలా మున్నని ప్రదేశంలో ఏర్పాటు చేయబడింది.)

సీతమ్మతల్లి ససేమిరా అనటం చూసి తల్లి దండ్రులా సంబంధం వొదులుకున్నారు. కాని మంచి సంబంధం పోయిందని అందరూ గునిశారు. పరాయివాళ్ళు కూడా ముక్కుమీద వేలేసుకుని, సీత కేసి వింతగా చూశారు పచ్చ చీరమీద ఎఱ్ఱ జాకెట్టు వేసుకుంటే చూసినట్లుగా.

అయితే ఏం ? తాను ఆ సంబంధం తిప్పెయ్యటం ఎంతో తెలివయిన పని అని ఒక్క నెలలోపుగా రుజువయింది. ఎవ్వరూ అనుకోకుండా, తల వని తలపుగా, దేవుడు పంపించినట్టు ఒకనాటి ఉదయం సీత తండ్రితో ఏదో మాట్లాడుతుండగా ఒక కుర్రాడు లోపలికి నడుచుకుంటూ వచ్చాడు. చాలా సన్నగా, చాలా పొడుగ్గా, నాజూగ్గా ఉన్నాడు. సన్నని చురుకైన మొహమూ, ముక్కు, పెద్ద కళ్ళూ, విశాలమైన నుదురూనూ. పాతికేళ్ళుండొచ్చు. చాలా ఖరీదైన పామ్‌బీచ్ సూట్ వేసుకున్నాడు. ఈవెనింగ్ హాట్ తీసి చేతులో పట్టుకుంటే జుట్టు నిగనిగలాడు తున్నది. కాలి బూట్ జుట్టుతో పోటీ చేస్తున్నది.

అతన్ని చూస్తూనే సీతమ్మతల్లి, "వీడే నా మొగుడు" అనుకుంది. మరుక్షణంలోనే తెలిపోయింది, అతనూ ఆ పని మీదే వచ్చాడని.

సీత తండ్రి కూర్చో బెట్టి అతన్ని అనేక ప్రశ్నలు వేశాడు. అతను కలకత్తాలో ఉద్యోగం చేస్తూ మద్రాసుకు బదిలీ అయినాడు. రెండు వందల యాభై జీతం. కాకినాడలో ఒక ఇల్లుంది, అయిదారు వేలు చేస్తుంది. అక్కడికి పదిమైళ్ళ దూరంలో అతనికి పన్నెండెకరాల ఆస్తి ఉంది. తల్లిదండ్రులు లేరు. అన్నదమ్ము లెవరూ లేరు. ఒక చెల్లెల్ని పట్నమే ఇచ్చారు. ఇవాళో రేపోవచ్చి పిల్లను చూస్తుంది.

తండ్రి సీత సమ్మతి వేరే అడగ నవసరం లేకపోయింది. జాతకాలూ అవీ చూసుకున్నారు. కృష్ణారావు బావగారే స్వయంగావచ్చి ముహూర్తమూ అదీ నిశ్చయించు కున్నాడు. పట్నంలోనే పెళ్ళి వైభవంగా జరిగింది.

పెళ్ళిఅయిన మర్నాడే సీత భర్తతో సినిమాకు వెళ్ళటానికి ప్రయాణ మయింది. కాని అతను బీచికి వెళదామన్నాడు. సీత సీతాకోక చిలకలాగా ముస్తాబయింది. కాలి నడకనే ఇద్దరూ శాంతోమ్ బీచికి ప్రయాణమైనారు. దారి పొడుగూతా అందరి కళ్ళు తమమీదే ఉన్నాయను కున్నది సీత. కాని

అతను మాత్రం తనకేసి చూసిన పాపాన పోయినట్లు లేదు. తన అలంకరణం గురించి ఏమన్నా అంటాడను కున్నది.

ఇసుకలో కూచుందా మన్నాడు కృష్ణారావు. చేతి రుమాలు అత నివ్వక పోవటం చూసి సీతే అడిగింది.

“ఫరవాలేదు కూర్చో” అన్నాడతను. “నేనట్టే చూస్తున్నాను. మనకు నిజమైన ప్రతిబంధకాలు ఈ ఖరీదైన చీరెలూ, ఈ దిక్కుమాలిన నాగరికతానూ. నాకీ జీవితంతో విసిగెత్తిపోయింది. ఈ ఉద్యోగం మాని వేస్తాను. మా పల్లెటూరు వెళ్ళి పొలం చేసుకుంటూ హాయిగా కాలంగడు పుదాం. నేను కవిత్వం రాస్తాను. నువ్వు పాలు పితుకుదువు గాని!” అన్నాడు కృష్ణారావు.

“చాల్లెండి!” అన్నది సీత.

అతను సీతకేసి ఆశ్చర్యంగా చూసి, “ఎగతాళి గాదు. వారం రోజుల క్రితం నీ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను...నిజానికి చూడు, ఈ ట్రాముల గోల మధ్య, ఈ బస్సుల అడావుడిలో, ఈ పట్నవాసపు ఉక్కిరి బిక్కిరిలో మనం జీవించటమనేదే మరిచి పోతున్నాం. నేను హాయిగా చొక్కా విప్ప దీసి ఆరుబయట తిరిగి ఎన్నేళ్ళయిందో! ఈ పట్నంలో ఆరుబయటేదీ! మునంగాలంటే ఏమిటో ఎరుగుదువూ? ఒంటికి తగిన పనీ, తిండికి తగ్గ ఆకలి శరీరానికి తగ్గ విశ్రాంతి లేక మన కానందమంటే ఏమిటో కూడా తెలీ కుండా పోయింది. ఈ మనుషులు చూడు సాయంకాలం కాగానే ఎవరో తరిమినట్లు ఈ బీచికొచ్చి కూచుని మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి పోతారు. గంట కొట్టగానే లేస్తారు, గంట కొట్టగానే భోంచేస్తారు గంట కొట్టే లోపల ఆఫీసులో ఉంటారు. సాయంకాలం ఆరుగంటలకల్లా సినిమా చూసే అభిలాష లెమ్చుకుంటారు. ఫలాని ఆదివారం నాడు నాలుగున్నరకు అరియ కుడి రామానుజయ్యంగారి పాటమీద మనస్సు పోనిచ్చుకుంటారు. వీళ్ళలో ఎంతమంది కవిత్వం చదివారో కనుక్కో! వీళ్ళ ఎదట సౌందర్యం తాండ వించినా గుర్తించలేరు. టిస్యూ చీరెలూ, ఫేసు పౌడరూ మించిన అందం వీళ్ళకి కనిపించదు. ఆ అందం దురదృష్టవశాత్తూ ఆనంద మిచ్చేది కాదు— బాధిస్తుంది!...”

కృష్ణారావు ఏమేమిటో చెప్పుకు పోతున్నాడు. సీతకే మాట లేమీ వినిపించటంలేదు. సీతమ్మతల్లి గుండె ఈసారి ఎంత జారిందంటే ఆమె కళ్లు నీటితో నిండి ఏమీ కనిపించటం లేదు. ఆమె చెవులలో ఏదో హోరు పుట్టి ఇంకేమీ వినిపించటంలేదు...పాపం సీతమ్మ తల్లి!—